



## బార్‌లో అప్పు...!

ఎక్కడైనా అప్పు పెట్టొచ్చుగానీ, బార్లో పెడితే అన్యాయమై పోయేది ఎంతో నిజం. బియ్యపు కొట్లో బాకీ పడండి. తప్పు లేదు. కిరాణా కొట్టు అనండి బాధ లేదు. టైలరూ, సైకిల్ షాపూ ఇట్లా ఎన్నెన్నో చోట్ల పద్దులు పెట్టుకుని యిచ్చేస్తామంటే మన మర్యాదకి ఏమీ భంగం కలుగదు. పైగా అక్కడ మన మాటమీద గురీ, గౌరవం వుంటాయి. కష్టమర్ని ఆదుకు నీవ్యాపారం వృద్ధి చేసుకోవడం అవసరం గనక ఇట్లాంటి ఏర్పాట్లకి ఎప్పుడూ చోటుంటుంది.

కానీ బార్ సంగతి అట్లా కాదు. ఎంత కష్టమరైనా అతడు తాగుడికి అలవాటు పడ్డాడు గనక ఆ వ్యక్తి మీద బార్ వాళ్ళకి గౌరవం అంతంత మాత్రంగానే వుంటుంది. బార్ ఓనరు కష్టమర్ని నిత్యం శంకిస్తూనే

వుంటాడు. యింక ప్రేమాభిమానాలు ఎట్లా పుట్టుకు వస్తాయి. నమ్మకం ఏం పెంచుకుంటాడు. తరచూ ఒకే బార్‌కి వెళ్ళే అలవాటునా పరపతి పెరుగుతుందనుకోవడం కేవలం భ్రమ. మొదటి రెండు రౌండ్సూ సకల లాంఛనాలా, మర్యాదల్తో గడుస్తాయి. మూడో రౌండు బిగించేసరికి బేరర్ సైతం చిన్న చూపు చూసేస్తాడు. అయిస్ పట్రామంటే అయిపోయిందంటాడు. వాటర్ తీసుకు రమ్మంటే ఇదిగో తెస్తానని ఇంకో టేబుల్‌కి వెళ్ళిపోతాడు. పది నిముషాలు, పావుగంట, అరగంట రాడు. అంత సేపూ గ్లాసుని చూస్తూ కష్టమర్ కూచోలేడు. ఒకటికి రెండు తడవలు పిలిచినా బేరర్ రాడు. ఓపికూడా నశించి పోతుంది. నీళ్ళు రాకపోయినా ఫర్లేదనుకుంటాడు. కేవలం నీట్ కొట్టేస్తాడు. కిక్కు ఎక్కువవుతుంది. అక్కడ్నుంచీ దెబ్బమీద దెబ్బ బిల్లు పెరుగుతుంది. డబ్బు తక్కువగా వుంటుంది. రేపిస్తానంటే కౌంటర్లో మనిషి వూరుకోడు. బాగా అలవాటయిన కష్టమరే. కాని తాగుబోతు. వదిలి పెడితే గ్యారంటీ లేదు. డబ్బు దొరకదు. దొరికితే అప్పు ఎత్తేయాలనిపించదు. అందుచేత ఆ బార్‌కి రావడమే మానుకుంటాడు. దూరమైనా ఇంకో కొత్త బార్‌కే వెడుతుంటాడు. ఆఫ్టరాల్ పాతిక రూపాయలు అప్పుకి మొత్తం బేరమే గల్లంతవుతుంది. అప్పులిచ్చి కష్టమర్ని దూరం చేసుకొనే సిద్ధాంతం బార్ వాళ్ళకి సుతరామూ నచ్చదు.

కనుక సాధారణంగా బార్‌లో అప్పులు అంగీకరింపబడవు. డబ్బుంటే తాగమంటారు. లేకపోతే పొమ్మంటారు. ఈ సిద్ధాంతాన్ని వ్యతిరేకించి అప్పులివ్వడం జరిగిందా, అటు బార్ ఓనరూ, ఇటు కష్టమరూ యిద్దరూ దివాళా ఎత్తేస్తారు. వివరిస్తాను. వందమందికి అప్పులు పెట్టేరనుకుందాం. అందులో కేవలం ఇరవైమంది మాత్రమే మాట నిలబెట్టుకుంటారు. మిగతా ఎనభైమంది తప్పించుకు తిరుగుతారు. ఇతర బార్లలో కూర్చుంటారు. ఎనభైమందిని దూరం చేసుకుని బార్ వాళ్ళు దెబ్బతింటారు. అట్లాగే కష్టమర్సు అప్పు దొరుకుతుంది గదాని అయిన కాడికి తాగేస్తారు. నిత్యం పార్టీలిస్తారు. డబ్బు, ఆరోగ్యం రెండూ సర్వనాశనమైపోతాయి.

తాగడం తప్పో వప్పో వదిలేయండి. అప్పుచేసి తాగడం నీచాతి నీచం. బియ్యపు కొట్లోగాని, కిరాణ దుకాణంలో గాని అప్పు లున్నాయని

చెప్పుకుంటే అదో మర్యాదగా వుంటుంది. అయ్యో పాపమంటారు గనక సానుభూతి గూడా అపారంగా లభిస్తుంది. అవతలి వాళ్ళు మరీ జాలిగుండె కలవారైతే మన అప్పు వాళ్ళు తీర్చేసి మన దగ్గిర మెల్లిగా వసూలు చేసుకుంటామని సహకరిస్తారు. అట్లాగాకుండా బార్లో అప్పుందని చెప్పండి. చెప్పుతో కొడతారు. తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతారు. ఎవరైనా సాయం చేస్తే వాడ్ని కూడా చెప్పుతో కొడతామంటారు. బంధుమిత్రుల్లో పరపతి పడిపోతుంది. మన ఖర్చుమీద తాగినవాడు కూడా మనల్ని చీదరించుకుంటాడు. బార్లో అప్పు అనే అపకీర్తి చుట్టుపక్కలకి పాకుతుంది. ఇంతకుముందు ధారాళంగా అప్పులిచ్చిన బియ్యపుకొట్టు మనిషి కూడా మన చరిత్ర విని భయపడి అప్పులివ్వడం మానుకున్నాం మేష్టారూ! అని ఖచ్చితంగా చెప్పేస్తాడు. పి. యఫ్. లోనే ఆదుకోవాలి. ఆ ఏర్పాటు చేసుకుంటే ప్రావిడెంటుఫండు కూడా తాగేసే పరమ దుర్మార్గు డంటారు. పిల్లాడికి స్కూలు ఫీజు కట్టాలంటే పుస్తెలైనా తాకట్టు పెట్టగల భార్యామణి భర్త తాగుడికి దాచుకున్న డబ్బు ఇవ్వమంటే ఉరేసుకుని చస్తానంటుంది.

బార్ మనిషి పోరు పెడుతూనే వుంటాడు. ఇంటికి రెండు పూటలా వచ్చి వెడుతుంటాడు. పరువు ప్రతిష్ఠలు వీధి కెక్కుతాయి. ఆ వీధివెంట ఆఫీసుకు వెళ్ళాలంటే సిగ్గు. తలెత్తి ఎట్టాగూ నడవలేడు. తల వంచుకు నడుస్తున్నా పాడు చెవులు పనిచేస్తూనే వుంటాయి. ఎవళ్ళో ఏదో అంటారు. అది తననే అనుకుంటాడు. ఎవళ్ళో ఎందుకో నవ్వుకుంటారు. అది తన గురించే నవ్వుకుంటున్నారని నమ్ముతాడు. ఇన్ని ఈతిబాధలు పళ్ళేక ఊరొదిలి పారిపోతాడు. సెలవ వుండదు. జీతం నష్టం. అయిదారు నెలలు ఊళ్ళో కనిపించడు. అంతమాత్రాన సమస్య పరిష్కారం కాకపోగా కష్టాలు మరింత ఎక్కువవుతాయి. ఊళ్ళోకి వచ్చింతరువాత అతనిమీద దాడి ఎక్కువవుతుంది. అదిగో అతనే అప్పుచేసి తెగతాగి ఊరొదిలి పారిపోయి మళ్ళా తిరిగొచ్చేడు. కట్టుకున్న భార్యనీ, కన్నపిల్లల్నీ ఉసురు పెట్టిన పెద్దమనిషి అడుగో, అతనే! అందరూ తన గురించి అనుకుంటున్నట్టు దపుట్ కలుగుతుంది. నీ తాగుడికి నా పొలం ఖర్చయింది. నా పొలం

తాగేసిన దుర్మార్గుడివి నువ్వు అనే మావగారి తిట్లూ, దీవెనలూ ఎప్పటి కప్పుడు వింటూ కృంగిపోతాడు. మరో పక్క ఆఫీసులో యుద్ధం. రూల్సుకి వ్యతిరేకంగా ప్రవర్తించి పరారీ అయినందుకు నిన్ను ఉద్యోగంలోంచి ఎందుకు తీసేయగూడదనే మెమో పెద్ద భూతంలా కనిపిస్తుంది. ఆ తర్వాత గొడవ నేను రాయదలుచుకోలేదు.

కాసేపు కూచుందాం వస్తారేమిటి అని అడిగేను కొత్తగా కలిసిన ఫ్రెండుని. అతను ముక్కుమీద వేలేసుకొని నేరమన్నట్లు నావైపు చూసేడు. అలవాటులేదేమో పాప మనుకున్నాను. కానేకాదు. కూచోడమంటూ జరిగితే ఏకంగా రెండు రోజులు లేవకుండా కూచోడం అతని సెంటిమెంట్ అని చెప్పేడు. అయ్ లవ్ డ్రింక్స్ అన్నాడు. అపారంగా ప్రేమిస్తాను గనకనే ఒకటి రెండు గంటల్లో సరిపెట్టుకోలేనన్నాడు. ఓపికుంటే చెప్పండి, రెండు రోజులు కూచుందామన్నాడు. చేతులు జోడించి నేను అతన్ని విడిచి పెట్టేసేను.

బాగా ఆలోచించిచూస్తే అతని పద్ధతే బెటరనిపిస్తోంది. తాగాలనుకున్న ప్పుడు రెండు రోజులు టైం దొరకాలి. దాని కయ్యే ఖర్చుని మన పర్సు పర్మిట్ చెయ్యాలి. మనతో కూచునే ఫ్రెండ్సు కూడా అందుకు అంగీక రించాలి. మంచి మైన్యూ దొరకాలి. మాట్లాడుకునేందుకు రెండు రోజులు పొడుగుండే సబ్జెక్టు దొరకాలి. ఇన్ని పాయింట్లూ సక్రమంగా అఘోరించా లనుకుంటే దానికి ఏ డిశంబరు థర్టీఫస్టో అనుకూలిస్తుంది. డిశంబరు థర్టీ ఫస్టు ఏడాదికి ఒక తడవే వస్తుంది కనక ఏడాదికి ఒకమాటే కాలక్షేపం జరుగుతుంది. గొడవలేదు. అందుచేత అతని పాలసీని నేను మనసారా మెచ్చుకుంటున్నాను. మెచ్చుకోవడం వరకు బాగానే వుంటుంది. పాలో అవడం ప్రారంభిస్తే మళ్ళా కథ మామూలే అవుతుంది. ఈ పద్ధతికి పదిమంది ఫ్రెండ్సూ అంగీకరిస్తే రెండే రోజుల సిట్టింగులు నెలకి పదిహేను పడతాయి. ఆ హింసకంటే రోజుకో గంట కక్కుర్తి పడటమే బెటరని మళ్ళా మనకే అనిపిస్తుంది.